www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 జనవరి 2024

5

అన్నమయ్య

క్రీడా స్ఫూర్తిని చాటాలి : 'ఆకేపాటి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు శనివారం కాకడాలు చేతబట్టి రాజంపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, చొప్ప గంగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేటలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. క్రీడలు విభిన్న ప్రాంతాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పుతాయని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఆకేపాటి, పోలా శ్రీనివాసులురెడ్డి

మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తా

బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

- పుంగనూరులో టిడిపి జెండా ఎగురవేస్తాం
- టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తాం
- పీలేరు రా..కదలి రా సభలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు

ప్రజలకు అభివాదం చేస్తున్న నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లా పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి పరిసర ప్రాంతాలను కలుపుతూ జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని తెలుగేదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని పీలేరులో రా..కదలి రా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో రాజంపేట పార్లమెంట్ పరిధిలోని టిడిపి అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని ఖరీదైన వనరులను అధికార వైసిపి ఎమ్మెల్యేలను ఇష్టానుసారంగా దోచుకున్నారని తెలిపారు. రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గ కేంద్రాల పరిధిలోని బైరైటీస్ మొదలుకుని ఎర్రచందనం, ఇసుక, భూములను అప్పనంగా బొక్కేశారని విమర్శించారు. ఇదీ చాలక పోవడంతో పీలేరు మూలుగను సైతం పీల్చే శారని విమర్శించారు. కలికిరి, గుర్రకొండ ప్రాంతాల్లోని మైనింగ్‌ను ఇష్టానుసారంగా కబ్జా చేశారన్నారు. పాపాల పెద్దిరెడ్డి నీ అవినీతి బాగోతం గురించి తెలిసి పోయిందని తెలిపారు. కుప్పంలో పోటీ చేస్తాడని, ముందు పుంగనూరును కాపాడుకోవాలని, పుంగనూరులో టిడిపి జెండా ఎగుర వేయడం ఖాయమని తెలిపారు. ఏడాది కిందట వైనాట్ 175 అన్నారని, ఇప్పుడేమో 69 మంది ఎమ్మెల్యేలు ఓడిపోతారనే భయంతో వారి సీట్లను మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. వైనాట్ పులివెందుల అని, పులివెందుల్లో టిడిపి గెలుపు తథ్యమన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని భూస్థాపితం చేస్తామని తెలిపారు. అన్నమయ్య డ్యామ్ తెగిపోయి మూడేళ్లవుతోందని, ఇప్పటి వరకు పునరుద్ధరణ పనులు చేపట్టకుండా ఏమి చేస్తున్నావని నిలదీశారు. పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి ప్రాంతాల్లో టమోటాను పెద్ద ఎత్తున పండిస్తారని, కానీ స్థిరమైన ధరలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయడం తోపాటు ఫుడ్‌ప్రాసెసింగ్ సంస్థలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిత్యావసరాల ధరలను దించే బాధ్యతల్ని తీసుకుంటామన్నారు. పీలేరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే ఎంఐపిసి భూముల్లోకి పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. 2019 నుంచి పార్టీ తలపెట్టిన యువగళం, మినీ మహానాడు, సబ్‌జైలు సందర్శన వంటి కార్యక్రమాలను జయప్రదం చేయడంలో కార్యకర్తలు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పీలేరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, తంబళ్లపల్లె, రాజంపేట, రాయచోటి ఇన్‌ఛార్జులు శంకర్ యాదవ్, బత్యాల చెంగల్రాయులు, రమేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు గంటా నరహరి, చల్లామధు, పర్వీన్‌తాజ్, సూర్యప్రకాష్‌రెడ్డి, ఎద్దుల సుబ్బరాయుడు, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడును గజమాలతో సత్కరిస్తున్న పీలేరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం వీరబల్లె మండలం ఉప్పరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన లైబ్రరీని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లా డుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన దిశగా ముందుకు వెళితే అనుకున్నది సాధించ వచ్చునన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని తమ పిల్లలు బాగా చద వాలని పాఠశాలలకు పంపుతుంటారని విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. వంగిమల్ల గ్రామంలో ఆమూరివాండ్ల కిరణ్ సహకారంతో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరుతో లైబ్రరీ నిర్మించారని, ప్రతి విద్యార్థి లైబ్రరీలోని మంచి మంచి బుక్స్ చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకో వాలన్నారు. వంగిమల్ల జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తుందన్నారు. విద్యార్థి బాగా చదివి ఆర్డీవోలు, కలెక్టర్లు స్థాయికి ఎదగాలన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల చదువుకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేసి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పాఠశాలలు తెలిసిన వెంటనే విద్యార్థులకు బుక్స్ యూనిఫామ్ అందజేసి ప్రతి విద్యార్థి బాగా చదివే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇస్తూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. ఉప్పరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రహరీ, వాటర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సర్పంచ్ సరస్వతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి

ఉపాధ్యాయులకు నోటీసులివ్వడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లి

మహాసభకు అనుమతి ఇచ్చి హాజరవుతున్న ఉపాధ్యాయులకు పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమని యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా నాయకులు పురం వెంకటరమణ అన్నారు. యుటిఎఫ్ ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో ఆదివారం రాజమండ్రిలో జరగబోవు పాత పెన్షన్ సభకు ప్రభుత్వం అనుమతి ఇచ్చి మహాసభకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు హాజరు కాకూడదని హాజరైతే చర్యలు తీసుకుంటామని పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మదనపల్లి డివిజన్ నుండి సభకు హాజరవుతున్న జిల్లా గౌరవాధ్యక్షులు టి.సుధాకర్ నాయుడు జిల్లా సహాధ్యక్షులు హేమలత జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, రవి, ప్రకాష్, సుధాకర్‌లతో పాటు చాలా మంది యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులలకు పోలీసులు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు.

వెంకటరమణకు నోటీసు ఇస్తున్న పోలీసు

ఓటు రాజకీయాలు చేస్తే తిరుగుబాటు తప్పదు

- బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు

ప్రజాశక్తి-మదనపల్లి

ఆటో కార్మికులకు నష్టాన్ని కలిగించే పథకాలు మానుకోవాలని, ఓటు రాజకీయాలు చేయాలని చూస్తే కార్మిక తిరుగుబాటు తప్పదని, ఆటో కార్మికులతో రాష్ట్ర బంద్‌కు బహుజన సేన ఆటో సంఘాల జెఎసి పిలుపు ఇచ్చినట్లు బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు అన్నారు. శనివారం ఆటో యూనియన్ జెఎసి బహుజన సేన కార్మిక గర్జన సభ రెడ్డిబాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో ప్రకటించే క్రమంలో ఉచిత హామీలు ఇస్తూ కార్మికులు, కుటుంబాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో సంఘం జెఎసి అధ్యక్షులు శ్రీరాములు, ఎస్.గంగులప్ప, రమేష్, సాయిరాం, నాగర్జున, బహుజన సేన రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆనంద్, యూనియన్ నాయకులు రాఘవేంద్ర యాదవ్, మైనార్టీ నాయకులు, నూర్ ఆలం, వాల్మీకి సంఘం నాయకులు పులి శ్రీనివాసులు, మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మూడేళ్లల్లో నగరవనం అభివృద్ధి

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు నిర్మించే నగరవనాన్ని రాబోయే రెండు మూడు సంవత్సరాలలో అత్యంత సుందరంగా తీర్చి దిద్దుతామని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గాలివీడు రోడ్డు, అబ్బవరంలో నిర్మించిన నగరవనంలో మాండవ్య ఎకో పార్కును ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నమయ్య నూతన జిల్లాలో ప్రతి ఒక్క సహకారంతో నగరవనాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. జిల్లాలోని ప్రజల భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని దాదాపు 76 ఎకరాలలో నిర్మించే నగరవనాన్ని మూడు కోట్ల రూపాయలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నగర వనానికి దగ్గరలో ఉన్న కంచాలమ్మగండిలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నగరవనం చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, రాణివనం, నక్షత్ర వనం, చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్ మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇంకా వెలిగల్లు ప్రాజెక్టు నుంచి వాటర్ కనెక్షన్ తీసుకుని ఈ ప్రాంతమంతా పచ్చదనం వెల్లివిరిసేలా మొక్కలు పెంచుతామన్నారు. రాత్రి సమయాలలో కూడా ప్రజలు నగరవనాన్ని సందర్శించే విధంగా సోలార్ సిస్టం ద్వారా అద్భుతమైన లైటింగ్ ఏర్పాటు చేయడం, పురుషులు, మహిళలకు వేరువేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో నగరవనం త్వరితగతిన అభివృద్ధి చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. పండుగ రోజుల్లో, విద్యార్థులకు సెలవు దినాలలో ప్రతి ఒక్కరూ ఇక్కడికి వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు అన్ని రకాలుగా నగరవనం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. రాబోయే రోజులలో నగరవనం రూపురేఖలు మార్చేందుకు ప్రజలు, దాతలు ప్రతి ఒక్కరు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఐసిఐసిఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎపిఎఫ్‌డిసి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, అడిషనల్ పిసిసిఎఫ్ డికె సింగ్, సిసిఎఫ్ నాగేశ్వరరావు, ఐసిఐసిఐ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ అనూష, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగమనీశ్వరి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జి కలెక్టర్

కోర్టు అద్దె భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్జి కృష్ణన్ కుట్టి

అద్దె భవనంలోకి కోర్టు సముదాయాలు

- అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి

ప్రజాశక్తి- రాయచోటి

40 ఏళ్ల కిందట నిర్మించిన రాయచోటి కోర్టు భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని రాయచోటి కోర్టు సముదాయాలను ఒక అద్దె భవనంలోనికి శనివారం మార్చారు. రాయచోటిలో ప్రస్తుతం ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు అడిషనల్ జుడిషియల్ మేజి స్టేట్, ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మే స్టేట్ పనిచేస్తున్నాయి. అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మేజిస్టేట్ కోర్టు 2026 లో నిర్మించిన నూతన భవనాల్లో కొనసాగుతోంది. మిగిలిన కోర్టులన్నీ కూడా 1984లో నిర్మించిన భవనాల్లో నడుస్తున్నాయి. ఈ భవనాలకు 15 ఏళ్ల కిందట మరమ్మతులు చేశారు. గత రెండు మూడు సంవత్సరాలుగా భవనాల మోల్డింగ్ పెచ్చులు ఊడి కిందట పడుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పాత కోర్టు భవనాల స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని రోడ్లు భవనాలు శాఖ వారి సూచనల మేరకు రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాత కోర్టు భవనాలలో నిర్వహిస్తున్న రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ కోర్టులను పాత భవనాల నుంచి ప్రయివేట్ భవనాలలోనికి మార్చాలని హైకోర్టు నుంచి ఇటీవలనే ఆదేశాలు రావడంతో, రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో ఖాళీగా ఉన్న ఒక ప్రయివేట్ పాఠశాల భవనాలను అద్దెకు తీసుకుని శనివారం మూడు కోర్టులను అక్కడికి తరలించారు. లోకదాలత్ కోర్టు కూడా పనులు ప్రారంభించింది. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో మూడు కోట్లు కూడా అక్కడే పని చేస్తాయని రాయచోటి ఐదవ జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి న్యాయవాదులకు తెలియజేశారు. ఈ విషయాన్ని కక్షిదారులకు దారులకు అందరికి కూడా తెలియజేయాలని ఆయన కోరారు.

నూతన భవనాల నిర్మాణానికి కృషి చేద్దాం

రాయచోటి పాత కోర్టు భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి పేర్కొన్నారు. లక్ష్మీపురంలోనీ అద్దె భవనాలలో శనివారం ఉదయం మొదటిసారిగా జరిగిన లోకదాలత్ కేసుల పరిష్కారాల సందర్భంగా ఆయన న్యాయవాదులతో మాట్లాడారు. త్వరలోనే రాయచోటి పాత కోర్టు భవనాలను తొలగించడానికి హైకోర్టు నుంచి ఆదేశాలు వస్తాయని వాటి స్థానంలో నూతన భవనాలను ఆధునికంగా నిర్మించడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు.

విజయగర్జన

ప్రజా'దృష్టి'

ఎట్టకేలకు అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సత్ఫలి తానిచ్చింది. సుమారు 42 రోజులపాటు 11 డిమాండ్లను నెరవే ర్చాలని కోరుతూ పట్టువిడవని సుదీర్ఘ పోరాటం స్పష్టమైన హామీలను రాబట్టుకుంది. సుమారు 10 డిమాండ్ల సాధనకు రోడ్‌మ్యాప్ కుదరడం స్వాగతించాల్సిన అంశం. ప్రభుత్వం సామ, ధాన బేధ, దండో పాయాలను ప్రయోగించినప్పటికీ స్పష్టత లభించే వరకూ పోరాటం సాగించడం ఉద్యమ చరిత్రలో ఉత్కంఠభరితమైన పేజీగా నిలిచిందని చెప్పవచ్చు. మంత్రుల దగ్గర నుంచి పోలీసులను, ఐసిడిఎస్, కలెక్టర్ వంటి ఉన్నతాదికారులను బెదిరింపులను సైతం లెక్క చేయకుండా సాగించిన పోరాటం అనుపమానమని చెప్పవచ్చు. ఎస్మా వంటి క్రూర చట్టాలను ప్రయోగించినప్పటికీ తెగువతో సాగించిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పవచ్చు. ఎవరు ఎన్ని బెదిరింపులు చేసినా తలవంచకుండా నాయకత్వంపై ఉంచిన విశ్వాసంతో సాగించిన పోరు అనితర సాధ్యమని చెప్పవచ్చు. ఏదేమైనా కొన్నేళ్లుగా పెండింగ్ బారినపడిన సమస్యల పరిష్కారానికి స్పష్టత లభించడం ఉపశమనం లభించింది. ప్రభుత్వం సైతం తమ అమ్ములపొదిలోని అస్త్రశస్త్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లే పదాతిదళాల తరహాలో పనిచేసే సంక్షేమ సైనికుల పట్ల ఇంతటి నిరంకుశంగా వ్యవహరించడం విస్మయాన్ని కలిగించింది. ప్రభుత్వం ఐదేళ్లుగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ ప్రయోగాన్ని పెద్దఎత్తున ఆచరణలోకి తీసుకెళ్తున్న అంగన్వాడీలు, ఆశాల పట్ల నిర్ధయగా వ్యవరించడం క్రూర పరిహాసమే. ప్రకృతి సహజ న్యాయసూత్రాల ప్రకారం కింది స్థాయి ఉద్యో గులకు అందించాల్సిన ప్రయోజనాల విషయంలో పాలకులు నిరంకుశంగా వ్యవహరించడం ఆందోళనకరం. ఇంతటి సుదీర్ఘ పోరాటానికి నాయకత్వం వహించిన సిఐటియు తెగువ అనన్య సామాన్యమని చెప్పవచ్చు. సిఐటియు నాయకత్వం ఆధ్వర్యంలో సాగించిన సుదీర్ఘ పోరాటం గతేడాది యుటిఎఫ్ సాగించిన చలో విజయవాడను మరిపించిందనే చెప్పాలి. భవిష్యత్ ఉద్యమాల నిర్వహణ, ప్రస్తావన సమయాల్లో తాజాగా జయప్రదంగా ముగిసిన అంగన్వాడీల ఉద్యమాన్ని స్మరించకుండా ఉండలేని పోరాటంగా నిలిచిపోనుందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- రాయచోటి

సచివాలయానికి వచ్చే సర్వీసులకు ఎప్పటికప్పుడూ పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సిబ్బందికి సూచించారు. శనివారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివీడు సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు .ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తుంటారని, సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. సచివాలయం పరిధిలో ఎంత మంది గర్భిణులు ఉన్నారని, ఎంత మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. రక్తహీనతతో బాధపడే వారందరికీ ఐరన్ టాబ్లెట్లు పౌష్టికాహారం అందేటట్లు చూడాలని సంబంధిత ఎఎన్ఎంకు సూచించారు. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనతను దూరం చేయడానికి పోషకాహారమైన భోజనం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ పాఠశాలల్లో చదివే చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేస్తూ వయసుకు తగ్గ బరువు ఎత్తు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల కేలండర్, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, రైతుభరోసా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితా, ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంది, సేవారత్న పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-కంభంవారిపల్లె

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు తొమ్మిది మంది జాతీయ స్థాయి నంది, సేవారత్న పురస్కారాలు అందుకున్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పురస్కార ప్రదానోత్సవంలో రేణిగుంటకు చెందిన ఎం.ఎ.జబ్బార్ ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక, ధార్మిక, కళారంగ సేవకులు, ప్రోత్సాహకులు డాక్టర్ షేక్ ఫరీద్‌బాబా, హసీనాబాను జాతీయ సేవా రత్న పురస్కారం, పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక రంగ కళాకారుడు ఖాదర్‌బాష, జర్నలిజం, మాస్ కమ్యూనికేటర్, ఫైన్ ఆర్ట్స్ కమ్యూనికేటర్ డాక్టర్ తుంగ యోగేష్ బాబు, లైట్ మ్యూజిక్, జానపద గాయని, మోటివేటర్ గండికోట ప్రమీల, శ్రీ నటరాజ కూచిపూడి కళామందిరం నిర్వాహకులు, ప్రముఖ నృత్య కళాకారిణి హరితా నగేష్, పుంగనూరుకు చెందిన ప్రముఖ గాయని, రచయిత్రి, యాంకర్ ఎస్.స్రవంతి, ఉపాధ్యాయుని, రచయిత్రి కె.గాయత్రిదేవి, గాయకులు ఎం.నారాయణస్వామి నంది పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమానికి ప్రముఖ సీనియర్ సినీనటి పూర్ణిమ రత్నం, సినీ నిర్మాతలు రామ సత్యనారాయణ, టిడిషో ప్రొడ్యూసర్ కపిల్‌దేవ్, ప్రముఖ జ్యోతిష్య పండితులు దైవజ్ఞ శర్మ, రుద్రమదేవి సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకులు లక్ష్మీ సామ్రాజ్యం, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్.సరోజనమ్మ, నిర్మాత గుర్రపు విజయ్ కుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా నాటక, సంగీత, నృత్య, పలు సేవా రంగాలకు చెందిన 60 మందికి నంది, జాతీయ సేవారత్న పురస్కారాలను నిర్వాహకులు ప్రదానం చేశారు.

ఖాదర్‌బాషాను నంది పురస్కారంతో సన్మానిస్తున్న నిర్వాహకులు

గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

సొంత నిధులతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట గ్రామపంచాయతీ ఆర్‌ఆర్ సెంటర్ 1,2,3 వీధుల్లో సుమారు మూడు లక్షల రూపాయలతో సొంత నిధులతో గ్రావెల్ రోడ్డును వేయించినట్లు గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా భరత్‌ను గ్రామ ప్రజలు పూల మాలతో, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాబోయే కాలంలో గ్రామ ప్రజలు ఇంటి స్థలాలకు ఇబ్బంది పడకుండా చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ భరత్ తన సొంత నిధులతో రోడ్డు వేయించడం వల్ల తమ వీధిలోకి కూరగాయల బండ్లు, ఆటోలు ఇంటి దగ్గరికి రావడం, వృద్ధులు, ఆరోగ్యం సరిలేని వారికి ఆటోలు ఇంటి దగ్గరికే వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లి మరలా ఇంటి దగ్గర దించి వారికి సౌకర్యంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి సూరి, వెంకటేష్, సైరస్, వెంకట లక్ష్మమ్మ, మునెమ్మ, రుక్మిణమ్మ, నారాయణస్వామి, పసుపులేటి మని, పసుపులేటి విజయమ్మ పాల్గొన్నారు.

ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుబ్రమణ్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి జిల్లాఎస్‌సి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతన కమిటీ నిమ్మనపల్లి మండలం, రాచవేటివారిపల్లి సర్పంచ్ కె.సుబ్రమణ్యం(మధు) నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైసిపి అన్ని విభాగాల నూతన కమిటీలను పార్టీ అధిష్టానం ప్రకటించిందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కమ్యూనిటీ విభాగాల నూతన కమిటీలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడినట్లు తెలిపారు. జిల్లా ఎస్‌సి విభాగం కమిటీ అధ్యక్షులుగా ఎం.రవీంద్ర (పీలేరు), ఉపాధ్యక్షులుగా చుక్కా అంజప్ప (రాయచోటి), ప్రధానకార్యదర్శిగా కె.సుబ్రమణ్యం(మధు) (మదనపల్లి) లతో పాటు మరో 11మందిని జాయింట్ సెక్రటరీలుగా పార్టీ అధిష్టానం నియమించిందని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, దళితుల సమస్యల పరిష్కారానికి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులు

తృతీయ స్థానంలో నిలిచిన నిమ్మనపల్లి క్రీడాకారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల కార్యక్రమంలో ఆఖరి రోజు నిమ్మనపల్లి క్రీడాకారులు తృతీయ స్థానాలతో ముగించినట్లు ఎంపిడిఒ శేషగిరిరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం సుమారు నెలరోజుల పాటు మండల స్థాయి, నియోజకవర్గస్థాయి లో పోటీలను నిర్వహించామని అధికారులు నిర్వహించామని తెలిపారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి వివిధ పోటీలలో క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. నిమ్మనపల్లె నుంచి నియోజకవర్గస్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికకావడం జరిగిందన్నారు. మదనపల్లిలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన ఆఖరి రోజు పోటీలలో మండలం నుంచి అగ్రహారం, నిమ్మనపల్లె-1 సచివాలయ పరిధిలోని బాల, బాలికల బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొని తృతీయ స్థానాలలో క్రీడలను ముగించినట్లు తెలిపారు. క్రీడల నిర్వహణకు పూర్తిస్థాయిలో సహకరించిన పిఇటిలు, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న వెంకటేశ్వరరావు, పునీత్‌చౌదరి

ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని సీనియర్ టిడిపి నాయకులు, మాజీ మండల అధ్యక్షులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు కుమారుడు మదిపట్ల పునీత్‌చౌదరి మొదటి నెల జీతం లక్షా పదివేల రూపాయలను ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు విరాళంగా టిడిపి అధ్యక్షులు చంద్రబాబుకు అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన కుమారుడి డిసెంబర్ నెలలో మొదటి జీతం రావడంతో ఆ జీతాన్ని ట్రస్ట్ కు చెక్కు రూపంలో అందించామని చెప్పారు. టిడిపి అభివృద్ధికి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కు ఎల్లవేళలా తన సహకారం అందించి పార్టీ కేడర్ పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సూర్యప్రకాష్ ఇచ్చిన కేక్‌ను కట్ చేసి తినిపించారు.

సక్సెస్ మైండ్ సెట్‌పై 'మిట్స్'లో సెమినార్

మదనపల్లి : మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్‌లో విద్యార్థులకు సక్సెస్ మైండ్ సెట్ పై సెమినార్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా బెంగుళూరుకు చెందిన రావూరి టెక్ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ వినోద్ కుమార్ పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవంతమైన వ్యక్తులు జీవితంలో విజయం సాధించడానికి తగినంత అవకాశాలు ఉన్నాయని ఎల్లప్పుడూ నమ్ముతారన్నారు. ప్రతికూల పరిస్థితులలో, మనుగడ, అభివృద్ధి చెందడం మధ్య వ్యత్యాసం తరచుగా మన స్తత్వానికి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, డాక్టర్ కుసుమ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

H.M.O.P.No. 118/2023

కంచర్ల కవిత, W/o కోలవాలి సురేంద్రరెడ్డి, D/o కంచర్ల మల్లికార్జునరెడ్డి, సాకిన్ డోర్‌నెం.3-35, బోటుమీదిపల్లి గ్రా॥, అనంత సముద్రం పో॥, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటిషనరు

Vs

కొలవాలి సురేంద్రరెడ్డి, S/o చలపతి రెడ్డి, సాకిన్, డోర్‌నెం. 6/11, గొల్లవారిపల్లె, H/o వత్తలూరు, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంటు

నోటీసు

పై కనిన పిటిషనరు, రెస్పాండెంటు అయిన మీ పైన పై కోర్టులో (వివాహం రద్దు కోరి) విడాకులు కోరి పిటిషన్ దాఖలు చేసి యుంటున్నారు. కావున మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యడల 1-2-2024వ తేదీన ఉదయం 10.30 గం॥ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెల్పడమైనది.

టి.చంద్రమోహన్
కె.సి.ఎమ్.రెడ్డి
పిటిషనరు పరం అడ్వకేటు,
రాజంపేట.

పారదర్శకంగా కులగణన సర్వే : డిపిఒ

కులగణన సర్వేపై అధికారులకు సూచనలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కుల గణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా పంచాయతీరాజ్ శాఖధికారిణి(డిపిఒ) ధనలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని రాచవేటివారిపల్లి సచివాలయ పరిధిలో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ సుబ్రమణ్యం, ఇఒపిఆర్‌డి చలపతిరావుతో కలిసి పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని ప్రతి ఇంటికి వెళ్లి, ఇంటిలోని సభ్యులను స్వయంగా విచారించి, వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. ఎక్కడా కూడా తప్పులు దొర్లడానికి వీలులేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. కొన్ని సచివాలయాలు ఇంకా సర్వే నిర్వహించడంలో వెనకబడి ఉన్నాయని, వెంటనే పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించటానికి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి మారెప్ప, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యం ఎంచుకొని విద్యను అభ్యసించాలని అప్పుడే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అది ఎంతో ఉపయోగపడుతుందని కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీతలైన ఎస్.రంగనాథ్‌గుప్తా, సిహెచ్. వెంకటరత్నంలు తమ కళాశాలలో చదివే విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసేందుకు కోసం ఒక్కొక్కరు లక్ష రూపాయలు చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసి అందులో వచ్చే వడ్డీ డబ్బులను ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులుగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ కళాశాల విద్యార్థులు హర్షిని ప్రియ, బి.మెర్లిన్ మండోనా, బి.జానకిలకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జివి.ప్రసాద్ చేతుల మీదుగా అందించామని పేర్కొన్నారు.ఎస్ హర్షిత, కె.చంద్రశ్రీ, వి.అనితలకు రెండు వేలు, వినయ్‌కుమార్‌కు వెయ్యి రూపాయలు అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జివి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చినప్పుడే తల్లిదండ్రులకు సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. ఉన్నతమైన విద్యతోనే సమాజంలో గౌరవం, ప్రతిష్టలు పెరుగుతాయన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వీరబల్లి

పాఠశాలలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

స్వచ్ఛతా ఎన్‌ఎస్‌ఎస్ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మూడవరోజు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పారిశుధ్య పనులు చేపట్టారు. దత్తత గ్రామమైన మంగళపల్లిలో ఎంపిపి స్కూల్ ఆవరణంలో పిచ్చి మొక్కలను, కంప చెట్లను తొలగించి, చెట్లకు పాదులు తీసి, మురుగు కాలువ శుభ్రం చేసి, చెట్లకు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు, వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఏటా స్వచ్ఛతా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాములు నిర్వహిస్తుంది. విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత, స్వచ్ఛతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా రోజుకు ఒక కార్యక్రమాన్ని చేపడుతుంది ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అన్నారు. 50 మంది వాలంటీర్లకు పాఠశాలలో భోజనం తయారు చేసివిద్యార్థులు వడ్డించడం జరిగిందన్నారు. కార్యక్రమం చేయడం ద్వారా పాఠశాల టీచర్లు హసీనా బేగం, సైలజ, పాల్గొని వాలంటీర్లకు ప్రోత్సాహం ఇచ్చి స్పెషల్ క్యాంపునకు మా పాఠశాలను ఎన్నుకోవడం చాలా సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, శ్యాంసుందర్ రెడ్డి, చంద్రశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : 'గడికోట'

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

మహిళల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం చిన్నమండెంలో నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్మన్ దేవనాథ్‌తో కలిసి పాల్గొన్నారు.మండలంలోని 524 సంఘాలకు రూ.3.75 కోట్ల విలువచేసే చెక్కును ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయానికున్న డ్వాక్రా రుణాలను నాలుగువిడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటికి సంపూర్ణంగా ఆహామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.50లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రభుత్వం అందించిందన్నారు. అమ్మఒడికి రూ.30 వేల కోట్లు, చేయూతకు రూ.25 వేల కోట్ల నిధులను ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని అవి చేస్తాం, ఇవి చేస్తామని గొప్పలు చెపుతున్న పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు జగన్ తరహాలో ఈ మాదిరిగా సంక్షేమ పథకాలను అమలు చేసివుండొచ్చు కదా అని ప్రశ్నించారు నాలుగన్నరేళ్ల కాలంలోనే సీఎం జగన్ సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థ, అమ్మఒడి, చేయూత, ఆసరా విద్యా దీవెన, వసతి దీవెన పథకాలును అమలు చేశారన్నారు. కార్యక్ర`మంలో అధికా రులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఐసి ఫైనల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎన్‌ఎస్‌ఐసి (నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ చాలెంజ్) ఇండియా కాంపిటీషన్ లో నందలూరు గొబ్బిళ్ళ అక్షర స్కూల్‌కు విద్యార్థులు అఫ్రీన్, ఆర్షియా తస్లీమ్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ కరస్పాండెంట్లు గొబ్బిళ్ళ త్రినాథ్, శ్రీనాథ్‌లు మాట్లాడుతూ 2023-24 సీజన్ ఏడు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మొదటి దశలో 2500 టీమ్స్ పైగా పాల్గొనగా మన ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు టీమ్స్ మాత్రమే రెండవ దశకు చేరుకోవడం, అందులో ఒకటి మన గొబ్బిళ్ళ అక్షర స్కూల్ కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చేపట్టిన అక్షర అస్త్ర, కవచ సస్టైనబుల్ అగ్రికల్చర్ టిల్లేజ్ మొదటి దశలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈనెల 23, 24 తేదీలలో బెంగుళూరులో జరిగిన ఫైనల్స్‌కు అఫ్రీన్, ఆర్షియా తస్లీమ్ వారి మెంటార్ వరప్రసాద్, కరెస్పాండెంట్ గొబ్బిళ్ళ శ్రీనాథ్ టీమ్ హజరయ్యారని తెలిపారుజ ఫైనల్స్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 40 జట్లు పాల్గొనగా, ఈ కాంఎటీషన్‌లో ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలలోని ప్రముఖులు జ్యూరీ మెంబెర్స్‌గా ఉన్నారని తెలిపారు. అందులో నాసా సైంటిస్ట్ దేశవ్యాప్తంగా వివిధ కంపెనీల సిఇఒలు ఉండటం గొప్ప విషయమని అన్నారు. తమ విద్యార్థుల ప్రాజెక్ట్ అక్షర అస్త్ర జ్యూరీ సభ్యులను విశేషంగా ఆకట్టుకుందని అన్నారు. జ్యూరీ మెంబెర్స్ తమ విద్యార్థుల అస్త్ర, కవచ పరికరాలను పరిశీలించి ధరించి అభినందించడం విశేషమని చెప్పారు. ఆలిండియా లెవెల్‌లో మొదటి బహుమతి గోల్డ్ మెడల్, రూ.5వేలు నగదు బహుమతి గెలుచుకోవడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా అక్షరస్కూల్ ఉపాధ్యాయులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కాలువల్లో పూడికను తీస్తున్న పారిశుధ్య కార్మికులు

డ్రైయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని బిసి కాలనీ మూడవ సచివాలయం పరిధిలో చాలా కాలంగా డ్రైనేజ్ సమస్య నెలకొంది.ఈ సందర్భంగా శనివారం కాలనీవాసులు మాట్లాడుతూ ఈ సమస్యపై గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాలేదన్నారు. సంబంధిత శానిటరీ ఇన్‌ఛార్జి కూడా స్పందించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు. మురుగునీటి సమస్య ఎక్కువ కావడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెంది అంటు రోగాల బారిన పడి అష్ట కష్టాలు పడ్డామని అన్నారు. ప్రస్తుత కమిషనర్ పి.ఆర్.మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి పారిశుధ్య కార్మికుల ద్వారా డ్రైయినేజీ సమస్యను పరిష్కరించారన్నారు. తమ సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన కమిషనర్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అభాగ్యుల స్థలాన్ని వారికే తిరిగివ్వాలి

ప్రజాశక్తి-మదనపల్లి

సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న బహుజన సేన నాయకులు

నిరాదరణకు గురవుతున్న అభాగ్య పిల్లలకు కేటాయించిన నివాస స్థలాన్ని వారికే తిరిగి అప్పజెంపేలా చర్యలు తీసుకోవాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రెండు రోజులు పాటు నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోక దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కనీస మానవతా దృక్పథంతో నైనా అనాథ బిడ్డలకు ఆసరాగా నిలవకపోవడం దారుణమని అన్నారు. అభాగ్యుల స్థలాలను కూడా దురాక్రమణ చేసి ధ్వంసానికి పాలపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు గడుస్తున్న ప్రభుత్వ అధికారులు స్పందించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. వారి స్థలాన్ని వారికి తిరిగి ఇచ్చేంత వరకు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. రెండవ రోజు నిరసన దీక్షలో ఆటో కార్మికులతో పాటుమహాకార్య ఫౌండేషన్ పూర్ణిమ, మోహన్, కొండపల్లి ఆనంద్, రాఘవేంద్ర యాదవ్, నవీన్‌నాయక్ సయ్యద్ అహ్మద్, శివరాం, వెంకటరాముడు, వెంకీ, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థి దశ నుంచి విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని అన్నారు. మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అంజని ప్రియదర్శిని మాట్లాడుతూ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ చట్టం, బాల్యవివాహాలు, మోటార్ వెహికల్‌యాక్ట్, విద్యహక్కు చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎం శంకరయ్య, బివి రమణయ్య,కళాశాల ప్రిన్సిపల్ వై.నరసింహమూర్తి, ఎస్ఐ డాక్టర్‌నాయక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

స్కిప్పింగ్‌లో రాష్ట్ర స్థాయికి రవిచంద్ర, గౌతమ్ విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని రవిచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్, గౌతమ్ స్కూల్ విద్యార్థులు రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం శింటో ఇమ్మానేయుల్,శైజు థామస్‌లు పేర్కొన్నారు.ఈ నెల 26న ప్రొద్దుటూరు లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి రవి చంద్ర స్కూల్ కు చెందిన పి. వెంకట గోవర్ధన్,(8 వ తరగతి), గౌతమ్ స్కూల్‌కు, చెందిన కె.నవీన్‌కుమార్‌రెడ్డి (8వ తరగతి)లు ఎంపిక అయినట్లు తెలిపారు. వారు ఈ నెల 28, 29, 30 తేదీలలో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

చెట్టుపై నుంచి పడి రైతు మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

చెట్టుపై నుంచి ప్రమాద వశాత్తు కిందపడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కొండకిందమేకల వారిపల్లిలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి కి చెందిన రైతు ఎం.రెడ్డప్పరెడ్డి(82) తన వ్యవసాయ పొలంలో ఉన్న చింత చెట్టెక్కి కాయలు కోస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి, మెరుగైప వైద్యం కోసం మదనపల్లి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడని తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రామసుబ్బారెడ్డి

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎంపిపి బాబుల్‌రెడ్డి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం ఎంపిపి తనయుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో శనివారం పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని పేదవారికి ప్రతి ఏటా చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. చీరల పంపిణీ అనంతరం వచ్చిన అందరికీ భోజన సౌకర్యం కల్పించామని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పటిరామనాథం, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చెక్కులు అందజేత

ప్రజాశక్తి-గాలివీడు

డ్వాక్రా సంఘాల మహిళలకు ఆదివారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపిడిఒ శేఖర్‌నాయక్ తెలిపారు. కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో నాలుగో విడత ఆసరా కింద మండలంలోని మహిళా సంఘాలకు 626 డ్వాక్రా సంఘాలకు రూ.4.22 కోట్లు చెక్కు రూపంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

60 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయస్థావరాలపై శనివారం నిమ్మనపల్లి పోలీసులు ముమ్మర దాడులు నిర్వహించారు. వేర్వేరు స్థావరాల్లో సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం మదనపల్లి మండలం బొమ్మనచెరువు, బత్తిని చెరువుకు చెందిన కుక్కల సుధాకర్ మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతీ, ఎంజికోట వద్ద నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులకు రాబడిన సమాచారం మేరకు దాడులు చేసి అతని వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెడ్డివారిపల్లి పంచాయతీ, పాలెం మాదిగపల్లెకు చెందిన అంగజాల శ్రీనివాసులు పాలెం మాదేపల్లెకు సమీపంలో నాటుసారాను విక్రయిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకొని, అతను వద్ద నుంచి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటసారా విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరు నిందితుల పై హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ, చక్రవర్తి లు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది రాజేష్, హరి, శివ పాల్గొన్నారు.